# 'సర్వేయర్ సార్.. మేమూ దళితులమే.. మా భూమి ఎక్కడ?'

### భూసర్వేలో తమ భూమికి హద్దులు చూపించాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి



**తల్లాడ, జూలై 18 (తెలంగాణ వాణి)** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం వెంకటగిరి రామచంద్రపురం పరిధిలోని సర్వే నంబర్ 175లో తమకు చెందిన వ్యవసాయ భూమిని గుర్తించి హద్దులు నిర్ధారించాలని దళిత కుటుంబ సభ్యులు అధికారులను కోరారు. బాధితుల కథనం ప్రకారం, 1972లో రజక శేషయ్య నుంచి ఇనపనూరి నాగయ్య 1.07 ఎకరాల పట్టా



భూమిని కొనుగోలు చేసి సాగు చేసుకున్నారు. అనంతరం ఆ భూమి వారసత్వంగా కుటుంబ సభ్యులకు సంక్రమించిందని తెలిపారు. జీవనోపాధి కోసం కొంతకాలం ఇతర ప్రాంతాలకు వెళ్లిన సమయంలో తమ భూమిని కొందరు ఆక్రమించి ప్రక్క భూముల్లో కలిపేశారని ఆరోపించారు. ఇటీవల భూ సర్వే సందర్భంగా అధికారులు తమకు భూమి ఉందని చెప్పినా, దాని ఖచ్చితమైన స్థానం చూపించలేదని బాధితులు పుల్లయ్య, రత్తయ్య, యేసురాములు తెలిపారు. తమకు చెందిన భూమిని గుర్తించి హద్దులు నిర్ధారించి, పూర్తి హక్కులు కల్పించాలని వారు పాత్రికేయుల సమక్షంలో అధికారులను కోరారు.

# తెల్లా పూరి' గా మారిన తెల్లాపూర్.. భక్తి శ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర



**తెల్లాపూర్ జూలై 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)** తెల్లాపూర్‌లో బెనా ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర భక్తి పారవశ్యంతో ఘనంగా జరిగింది. హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర గోపన్నపల్లి, రాజపుష్ప సర్కిల్ మీదుగా ఏలియన్స్ స్పేస్ స్టేషన్ వరకు కొనసాగింది. హరినామ సంకీర్తనలు, భజనలు, సాంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి, పాక్స్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ బీజేపీ నాయకులు శంషాబాద్ రాజు, మల్లేపల్లి రాజేందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. జగన్నాథ రథయాత్రతో తెల్లాపూర్ 'తెల్లా పూరి'గా మారి భక్తి వాతావరణంతో కళకళలాడింది.

# రాఘవపురంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ



**సుజాతనగర్, ప్రజాఅద్దం** :సుజాతనగర్ మండలం రాఘవపురం గ్రామపంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు చింతలపూడి రాజశేఖర్, కొత్తగూడెం డివిజన్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ బత్తుల వీరయ్య, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి లోశెట్టి నాగార్జున, పైడా ప్రసాద్, చిమట నాగేశ్వరరావు, మడిపల్లి శ్రీను, కత్తి బాలకృష్ణ, మాజీ సర్పంచ్ గరిక సాంబయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మా భూమి హద్దులు చూపించండి
# సర్వే అధికారులకు రైతుల వినతి



**తల్లాడ, జూలై 18 , (తెలంగాణ వాణి)** తల్లాడ మండలం బిల్లుపాడు (వెంకటగిరి) రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 175, 187లో తమకు చెందిన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమికి హద్దులు నిర్ధారించి చూపించాలని రైతు కుటుంబ సభ్యులు సర్వే అధికారులను కోరారు. 1997లో ఇంజం వెంకయ్య, అనుమయ్యల నుంచి భూమిని కొనుగోలు చేశామని, కొంతకాలం సాగు చేసిన అనంతరం ఆక్రమణలకు గురైందని సరికొండ రమణమ్మ కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమ భూమిని గుర్తించి హద్దులు నిర్ధారించి హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విన్నపం మేరకు సర్వేయర్ జయంత్, జీపీవో చిట్టెమ్మ, రెవెన్యూ సిబ్బంది స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రమణమ్మ కుటుంబ సభ్యులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్ట్

### పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన ఎస్సై రమాదేవి

**సుజాతనగర్ , ప్రజాఅద్దం** : సుజాతనగర్ మండలంలో మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఎస్సై రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 13వ తేదీ నుంచి మైనర్ బాలిక కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ రమాదేవి ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి శనివారం బాలికను గుర్తించి సురక్షితంగా రక్షించారు. దర్యాప్తులో రాఘవాపురం గ్రామానికి చెందిన చీమట అజయ్ బాలికను కిడ్నాప్ చేసినట్లు తేలడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం బీఎన్ఎస్ సంబంధిత సెక్షన్లతో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రమాదేవి తెలిపారు.